ప్రగతి 'సర్వే'

- పురోగతిలో సమగ్ర భూ సర్వే
- డ్రోన్‌తో గణాంకాల నమోదు పూర్తి
- నాలుగు గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన
- రోవర్లు తగినన్ని లేక జాప్యం

తెనాలి: తెనాలి రూరల్ మండలంలో జరుగుతున్న సమగ్ర భూ సర్వే పురోగతిలో ఉంది. తొలి దశ ఎంపిక చేసిన గ్రామాల్లో డ్రోన్‌తో గణాంకాల నమోదు పూర్తయింది. క్షేత్రస్థాయి సర్వేకు రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ప్రతి సర్వే నంబరుకు వెళ్లి, భూమిపై ఎవరు ఉన్నారు, చనిపోయిన రైతులు ఎవరైనా ఉంటే, వారి వారసులు ఎవరు ఉంటున్నదీ పరిశీలన చేశారు. హద్దు రాళ్ల నిర్ధారణలో నిమగ్నమయ్యారు. అవరమైన రోవర్లు తగినన్ని లేకపోవటంతో జాప్యం జరుగుతోంది. సర్వే నెలాఖరుకు పూర్తిచేయాలన్న ఆదేశాల మేరకు పనిచేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. సమగ్ర భూ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన విషయం తెలిసిందే. దాదాపు వందేళ్ల తర్వాత జరుగుతున్న సర్వేలో అక్షాంశ, రేఖాంశాల సహితంగా ప్రతి ఒక్కరి పంట పొలానికి పక్కా సరిహద్దులు నిర్ణయించి, హద్దు రాళ్లు ఏర్పాటు చేయనున్నారు. తెనాలి మండలంలో 13 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటిలోని 18 సచివాలయాల పరిధిలో మొత్తం 29 వేల ఎకరాల భూమికి సంబంధించిన సమగ్ర సర్వేను ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. తొలి దశలో ఆరు గ్రామాలను అధికారులు ఎంపిక చేశారు. నందివెలుగు (1,160 ఎకరాలు), సంగం జాగర్లమూడి (924 ఎకరాలు), గుడివాడ (1862 ఎకరాలు), కఠెవరం (4,091 ఎకరాలు), పినపాడు (710 ఎకరాలు), డి సేరి–27 ఎకరాల్లో సమగ్ర సర్వేకు రెవెన్యూ యంత్రాంగం శ్రీకారం చుట్టింది. సర్వేకు మొత్తం 18 బృందాలను ఏర్పాటు చేశారు. వీఆర్వో, సర్వేయర్‌తోపాటు సచివాలయ, ఇతర సిబ్బందిని ఈ బృందాల్లో నియమించారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే డ్రోన్‌తో గణాంకాల నమోదు చేశారు. ప్రస్తుతం నందివెలుగు, గుడివాడ, సంగం జాగర్లమూడి, పినపాడులో క్షేత్రస్థాయి సర్వే జరుగుతోంది. ప్రతి సర్వే నంబరుకు వెళ్లి భూమిపై ఎవరు ఉంటున్నారో తెలుసుకుంటారు. చనిపోయిన వాళ్లుంటే వారి వారసులతో దరఖాస్తు చేయిస్తున్నారు. భూమి కొనుగోలు దార్ల చేతుల్లో ఉంటే వారిచేత అర్జీ పెట్టిస్తున్నారు. నాలుగు గ్రామాల్లో 75 శాతం పని పూర్తయిందని


పినపాడులో క్షేత్రస్థాయి సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ (ఫైల్)


రోవరుతో క్షేత్రస్థాయి సర్వేలో రెవెన్యూ బృందం

మండల తహసీల్దారు కె.రవిబాబు వెల్లడించారు. సర్వే నంబర్ల ప్రకారం హద్దు రాళ్ల నిర్ధారణ (గ్రౌండ్ వాలిడేషన్)కు రోవర్లను వినియోగిస్తారని తెలిసిందే. నాలుగు గ్రామాల్లో జరుగుతున్న ఈ కార్యక్రమానికి తగినన్ని రోవర్లు అందుబాటులో లేకపోవటంతో అనివార్య జాప్యం జరుగుతోంది. అయినప్పటికీ జూన్ 30 నాటికి పూర్తిచేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో కార్యక్రమాన్ని సాధ్యమైనంత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నారు. హద్దు రాళ్ల నిర్ధారణ తర్వాత సర్వే నంబరు స్థానంలో సంబంధిత రైతులకు 'లాండ్ పర్సన్ మెంబర్' (ఎల్‌పీఎం) ధృవీకరణ ఇస్తారు. ఇంతకుముందు ఒక వ్యక్తికి గల భూమికి రెండేసి, మూడేసి సర్వే నంబర్లలో ఉండటం తెలిసిందే. ఇకపై అలా జరగదు... ఒక రైతుకు ఒక ఏరియాలో వేర్వేరుగా భూమి ఉన్నప్పటికీ అన్నీ కలిపి ఒకే విస్తీర్ణానికి ఎల్‌పీఎం నంబరుతో ఇస్తారు. వీఆర్వో, సర్వేయరు రైతులను కలిసి సంబంధిత పత్రాలను చూపుతారు. రైతు దగ్గరున్న పత్రాలతో పోల్చుకుంటారు. రైతు అంగీకారంతో ఎల్‌పీఎంను జారీచేస్తారు. కోర్టు, కుటుంబ వివాదాలు ఉన్న భూముల అంశాన్ని పెండింగులో ఉంచి, మిగిలినవన్నీ పరిష్కరించి, ఎల్‌పీఎంతో సహా నూతన పట్టాదారు పుస్తకాన్ని ఇస్తారు. ఇందులో భూమి హద్దులు, స్కెచ్‌లతో సహా పక్కాగా ముద్రించి ఉంటాయి. నాలుగు గ్రామాల్లో ఎల్‌పీఎంలు పరిష్కారమయ్యాక, ఇతర గ్రామాల్లో సమగ్ర సర్వేను కొనసాగిస్తారు.

మందుగానే అన్ని పరిశీలించాలి

సమగ్ర సర్వేలో రైతులు ప్రాథమిక దశలోనే సరిగా పరిశీలన చేసుకోవాలి. అధికారులు వచ్చినపుడు తమ దగ్గరున్న పత్రాలు, వారి దగ్గరున్న వివరాలను సరిచూసుకోవాలి. సమగ్ర సర్వే పూర్తయ్యాక సమస్యతో వస్తే ఉపయోగం ఉండదు.

– కె.రవిబాబు, మండల తహసీల్దారు, తెనాలి

ప్రజారంజక పాలనతో ప్రతి కుటుంబంలో ఆనందం

'గడప గడపకు'
ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రజారంజక పరిపాలనతో ప్రతి కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. సంగం జాగర్లమూడి గ్రామంలో గురువారం మూడో రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శివకుమార్ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రభుత్వ పాలనపై ప్రజా స్పందన తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలను ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. మహిళలు హారతి ఇచ్చి ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధి వస్తుందా లేదా అని ఆరా తీశారు. రావట్లేదంటే కారణం తెలుసుకుని, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ప్రతి కుటుంబం సీఎం వైఎస్ జగన్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తోందని చెప్పారు. సంగం జాగర్లమూడి ప్రజలు తనపై ఆదరణ చూపిస్తున్నారని, గడప గడపకు కార్యక్రమంలో ఇది స్పష్టమవుతోందన్నారు. న్యూస్ చానళ్లు, పేపర్ల కోసం ఈ కార్యక్రమం చేపట్టలేదని, నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుంటున్నట్టు వివరించారు. గ్రామంలో ఐదు వేలకు పైగా జనాభా ఉండగా 86 శాతం కుటుంబాలకు సంక్షేమ లబ్ధి చేకూరిందని తెలిపారు. రైతు రుణ మాఫీ చేస్తానని, 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చి, మోసం చేశాడని, 2016లో ఇదే సంగం జాగర్లమూడి గ్రామంలో రైతులు రుణ మాఫీ కాలేదని తనకు చెబుతున్న ఫోటోను చూపించారు. నాలుగేళ్లలో రూ. 11.80 కోట్ల సంక్షేమ ఫలాలను గ్రామస్తులకు డీబీటీ పద్ధతిలో అందించినట్టు తెలిపారు. 227 కుటుంబాలకు వైఎస్సార్ కాపు నేస్తం అందుతోందని, 818 మందికి పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రజలకు సంక్షేమం పూర్తిస్థాయిలో అందిందా లేదా అన్న అంశాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుసుకుంటున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను నమోదు చేసుకుని రానున్న నాలుగు నెలల్లో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు, పాలడుగు సాంబశివరావు, రెడ్డి శ్రీనివాసరావు, నాగమోతు రామారావు, పాటంశెట్టి నాగరాజు, దేవిరెడ్డి పూర్ణయ్య, అక్కిదాసు కిరణకుమార్, కఠారి హరీష్, బూరెల దుర్గ, ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.


మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం

మంగళగిరి: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పోరాటాల ద్వారానే పరిష్కరించుకోవాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, కార్మికులు, ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరుతూ గత నెల 30న ఇచ్ఛాపురం నుంచి బయలుదేరిన రాష్ట్రస్థాయి మున్సిపల్ ప్రచార జాతా గురువారం మంగళగిరి చేరుకుంది. జాతాకు మున్సిపల్ కార్మికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఐటీయూ కార్యాలయంలో ఆర్ వేణు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిపై పాలకులకు కనికరం లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల గురించి పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికుల సమస్యల పట్ల రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన పార్టీల తీరు ఒకటిగానే ఉందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యతిరేకత ఉందని, కార్మికులకు నష్టం కలిగించే విధానాలను అవలంభించడం బాధాకరమన్నారు. ఎర్రజెండా మాత్రమే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుందన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం రవి, గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి బి ముత్యాలరావు, రాష్ట్ర కార్యదర్శి టి నూకరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు వరలక్ష్మి నాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ చెంగయ్య, పట్టణ కార్యదర్శి వై కమలాకర్, యూనియన్ నాయకులు పి పూర్ణ, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

మంగళగిరి : మున్సిపల్ కార్మికులకు ఎన్నికల సందర్భంగా జగనన్న ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార జాతా నిర్వహించినట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు అన్నారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మే 31న ఇచ్ఛాపురంలో ప్రారంభమైన ప్రచార జాతా గురువారం తాడేపల్లి ప్రకాష్ నగర్ సెంటర్‌కు చేరుకుంది. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులతో పాటు ఔట్ సోర్సింగ్ కార్మికులను కూడా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు బి ముత్యాలరావు, నాయకులు ఎం రవి, వేముల దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, కె వెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తాం

తెనాలిరూరల్: ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తామని తెనాలి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట రాఘవరావు స్పష్టం చేశారు. తెనాలి ఎంవీఐ కార్యాలయ పరిధిలోని ప్రైవేటు పాఠశాలల బస్సు డ్రైవర్లు, పాఠశాలల ఇన్‌చార్జులతో స్థానిక మార్కెట్ యార్డులో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. పాఠశాలలు పునఃప్రారంభించేలోగా బస్సులన్నిటికీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాలన్నారు. సర్టిఫికెట్ లేని బస్సుల్లో విద్యార్థులకు తరలిస్తే వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతి బస్సుకు డ్రైవర్‌తో పాటు సహాయకులు తప్పనిసరిగా ఉండాలన్నారు. పాఠశాలల నిర్వాహకులు బస్సు డ్రైవర్లకు మూడు నెలలకోసారి వైద్యం, కంటి పరీక్షలు చేయించి రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. డ్రైవర్‌గా నియమించుకునే వ్యక్తికి కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలని, 60 ఏళ్లలోపు వయసు వారినే నియమించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. బస్సులో పర్మిట్, ఆర్‌సీ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, క్వార్టర్లీ ట్యాక్స్ రసీదు తప్పని సరిగా ఉండాల్సిందేనన్నారు. డ్రైవర్ వివరాలను వాహన వెనుక భాగంలో కనపడేలా ఉంచాలని చెప్పారు. సమావేశంలో ఏఎంవీఐ మధుసూదనరావు, సిబ్బంది ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ రాఘవరావు, ఏఎంవీఐ మధుసూదనరావు

ఏపీలో సినిమాలు తీసేవారికి ప్రోత్సాహం

తెనాలి: ఆంధ్రప్రదేశ్‌లో సినిమాలు తీసే వారిని ప్రోత్సహిస్తామని, అవసరమైన సహకారం అందించి, తగినవిధంగా సత్కరిస్తామని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. గతవారం విడుదలైన అభిలాష చిత్ర దర్శకుడు చలువాది శివ ప్రసాద్‌ను గురువారం సాయంత్రం మా–ఏపీ కార్యాలయంలో సత్కరించారు. నెల్లూరుకు చెందిన దర్శకుడు శివప్రసాద్, తెనాలికి చెందిన పదిమంది కళాకారులకు తన సినిమాలో నటించే అవకాశం కల్పించారనీ, తన సినిమాను ఆంధ్ర రాష్ట్రంలోనే చిత్రీకరించారని తెలిపారు. అందుకోసమే ఆయన్ను సత్కరించినట్టు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో షూటింగ్ చేసే నిర్మాణ సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు రాయితీ ఇచ్చి, మొత్తం 26 జిల్లాలోని లోకేషన్లలో షూటింగులకు ఉచితంగా అనుమతిని ఇస్తున్నట్టు గుర్తుచేశారు. అభిలాష చిత్ర దర్శకుడు చలువాది శివప్రసాద్ మాట్లాడుతూ తమ సినిమా విడుదలకు దిలీప్‌రాజా ఇచ్చిన సహకారం మరువలేమని చెప్పారు. చిత్రంలో విలన్‌గా నటించిన తెనాలి నటుడు బెల్లంకొండ వెంకట్, శ్రీను నాయక్, మన్నే సత్యనారాయణ, నాగలక్ష్మి, రఫీ, అరుణకుమారి, అమీర్‌చౌదరి పాల్గొన్నారు.


శివప్రసాద్‌ను సత్కరించిన దిలీప్‌రాజా

పాస్టర్ల గౌరవ వేతనం ఇప్పించాలని వినతి

మంగళగిరి: కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న పాస్టర్ల గౌరవ వేతనాన్ని ఇప్పించాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జాన్ బెన్నీ లింగం కోరారు. రాజ్యసభ సభ్యులు, వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డిని తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే రాష్ట్రంలో 5196 మంది పాస్టర్లకు గౌరవ వేతనాన్ని అందిస్తున్నారని, రెండో విడతలో 2022 డిసెంబరు నాటికి 3231 మంది పాస్టర్స్ గౌరవ వేతనానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రెండు నెలలుగా మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న పాస్టర్లకు గౌరవ వేతనం రావడం లేదని, అదే విధంగా రెండో విడతలో దరఖాస్తు చేసుకున్న పాస్టర్లకు ఏడు నెలలుగా గౌరవ వేతనం రావడం లేదని తెలిపారు. సమస్యపై రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఏఐసీసీ ట్రెజరర్ జి రాజు, అడ్వైజర్ రాంబాబు, ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ పీటర్‌సన్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ విజయసాయిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అధ్యక్షుడు డాక్టర్ జాన్ బెన్నీలింగం

వైభవంగా వీరాంజనేయ స్వామి జీవ ధ్వజ ప్రతిష్ఠ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని వీరాంజనేయస్వామి జీవధ్వజ ప్రతిష్ట వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే వీరాంజనేయుడికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్రనామ పూజలు అర్చకులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు నిర్వహించారు. అనంతరం వేణుగోపాలస్వామి ఆలయంలోని కల్యాణ మండపంలో హనుమద్ధ్వజానికి విశేషపూజలు, హోమం నిర్వహించారు. సాయంత్రం సువర్చలా సమేత వీరాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి కోలాట ప్రదర్శన, కర్రసాము, భజన కీర్తనలతో గ్రామోత్సవం నిర్వహించారు. పూజల్లో గోపాల కృష్ణమూర్తి, ఉమావెంకట నాగరత్నమాల, ధర్మకర్తలు రామతారకం, సూర్యనారాయణ, వెంకటరమణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

ఫిరంగిపురం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీటీసీ సభ్యుడు షేక్.ఖాసిం షాహిద్ అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో గురువారం త్వరలో ప్రభుత్వ పాఠశాలలో తీసే క్రమంలో విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించే క్రమంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా వారి తల్లిదండ్రులకు అవగాహన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు జ్ఞానశౌరీలు, మరియరాజులు కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ షేక్ ఖాజావలి, పాఠశాల చైర్మన్ మస్తాన్‌బాజిలు ఉన్నారు.

దోమల బెడదను నియంత్రించండి



తెనాలిఅర్బన్: ఇంటి పరిసరాల్లో దోమల బెడద నియంత్రణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, అసిస్టెంట్ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి సూచించారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మారీసుపేటలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోధకాలు వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్‌లు షేక్ రషీద్, షేక్ నవీద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమసుందరపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కంచర్లపాలెం గ్రామానికి చెందిన కఠెవరపు మోహనరావు మద్యం విక్రయిస్తున్నాడని గుర్తించి, అతని నుంచి ఆరు క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

ఎంపీడీఓ అత్తోట దీప్తి బాధ్యతల స్వీకారం

తాడికొండ: తాడికొండ మండల ఎంపీడీఓగా అత్తోట దీప్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. వట్టిచెరుకూరు మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న ఈమె బదిలీపై వచ్చి గురువారం తాడికొండలో బాధ్యతలు చేపట్టారు. తాడికొండ సర్పంచ్ తోకల సరోజినీ నరసింహారావు దంపతులు, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, రైతు సంఘం నాయకులు యడ్లపల్లి గాంధీ రామ్మోహనరావు, పూర్ణచంద్రరావు, పలువురు మండల పరిషత్ ఉద్యోగులు సిబ్బంది, కార్యదర్శులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బ్యాంకు రుణాలపై రైతులకు అవగాహన

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కి, పెదవడ్లపూడి గ్రామాల రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహనా సదస్సులకు పలువురు స్థానిక రైతులు హాజరయ్యారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న అనేక రకాలైన వ్యవసాయ సంబంధిత రుణాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, తోటల పెంపకం, క్రిషి వాహన్ మొదలగు వాటిపై రైతులకు వివరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఈ సీజన్‌కు కావాల్సిన వ్యవసాయ రుణాలను పొందవచ్చునని బ్యాంక్ అధికారులు తెలిపారు. గోల్డ్ లోన్స్ రెన్యువల్స్, అగ్రి లోన్స్ రెన్యువల్స్ సకాలంలో చేసుకుని తిరిగి అధిక మొత్తంలో రుణాలు పొందవచ్చని డిప్యూటీ జనరల్ మేనేజర్ సోమశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఎంవీవీ బంగార్రాజు, నూతక్కి, పెదవడ్లపూడి బ్రాంచి మేనేజర్లు రామునాయక్, ఫణికుమార్, కల్లం శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ సోమశేఖర్

తాగునీటి సంపులో జారిపడిన ఆవు

క్షేమంగా బయటకు తీసిన
అగ్నిమాపక శాఖ సిబ్బంది

మంగళగిరి: వేసవి దాహార్తిని తీర్చుకునేందుకు తాగునీటి సంపు వద్దకు వెళ్లిన ఓ ఆవు ప్రమాదవశాత్తూ అందులో జారిపడగా అగ్నిమాపక సిబ్బంది మూడు గంటలపాటు శ్రమించి క్షేమంగా బయటకు తీసిన ఘటన మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి నవులూరు ఈఎస్ఆర్ గార్డెన్స్‌లో చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.... నగర పరిధిలోని నవులూరు ఈఎస్ఆర్ గార్డెన్స్‌లోని తాగునీటి సంపులో నీటిని తాగేందుకు గురువారం ఓ ఆవు వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో జారిపడింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారాన్ని అందించగా హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వారు సంపులో ప్రమాదవశాత్తూ జారిపడిన ఆవును మూడు గంటలపాటు శ్రమించి క్షేమంగా బయటకు తీశారు. ఆవు ప్రాణాలతో బయటపడడంతో స్థానిక ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్లు వి శ్రీనివాసరెడ్డి, ఎస్ సాంబశిరావు, ఎం శ్రీనివాసరావు, పీహెచ్ శ్రీకాంత్‌రెడ్డి, సీహెచ్ శ్యామ్ కుమార్, పి రఘు తదితరులు పాల్గొన్నారు. సంపు ఆవరణ చుట్టూ ప్రహరీ నిర్మించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు. లేకుంటే ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు.


తాగునీటి సంపులో జారిపడిన ఆవును క్షేమంగా బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దేశంలో సమూల మార్పులు తెచ్చిన మోదీ

గుంటూరు మెడికల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక మంగళగిరి రోడ్డులో బీజేపీ తూర్పు అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ ఉమా శంకర్ అధ్యక్షతన కేంద్ర పథకాల లబ్ధిదారులతో సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్టీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తొమ్మిదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో సమూల మార్పు తీసుకొచ్చారన్నారు. డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ కేంద్ర పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్‌గౌడ్, కో కన్వీనర్ వనమానరేంద్ర, మంత్రి సుగుణ, షేక్ గౌస్‌మీరా, దారా అంబేడ్కర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఫ్యాన్లు బహూకరణ..
ప్రధాని నరేంద్ర మోదీపాలన తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ యువమోర్చా బాపట్ల ఇన్‌చార్జి తానుచింతల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరు అంకమ్మనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఫ్యాన్లు బహూకరించారు. పఠాన్‌చాందిని, అనిరుద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కర్ణాటక బ్యాంకులో ఉచిత కంటి వైద్య శిబిరం



తెనాలి: కర్ణాటక బ్యాంకు ఏర్పాటై శత వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా.. తెనాలి దేవీ చౌక్‌లోని బ్రాంచ్‌లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక హెల్త్ హాస్పిటల్ సౌజన్యంతో వైద్యులు రత్న భూషణ్, అశోక్, శ్రీనివాస్, పుష్పావతి కంటి వైద్య పరీక్షలు చేశారు. సూచనలు, సలహాలు అందించారు. బ్యాంకు తెనాలి శాఖ మేనేజరు ఎం.సుధీర్, అసిస్టెంట్ బ్రాంచి మేనేజరు ఆర్. సునీల్, సిబ్బంది అవినాష్, శ్రీకాంత్, శేషపాణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో ప్రాంగణ ఎంపికలు



తెనాలి: బుర్రిపాలెంలోని ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో ప్రముఖ ఫార్మా సంస్థలు దివిస్ లేబొరేటరీస్, హెటిరో డ్రగ్స్, ఎపి సోర్స్, అరబిందో ఫార్మా ప్రతినిధులు గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్, రీసెర్చ్, మెడికల్ కోడింగ్ విభాగాల్లో ఉద్యోగాలకు బీ–ఫార్మసీ, ఎం–ఫార్మసీ విద్యార్థులు 70 మంది పాల్గొన్నారు. ప్లేస్మెంట్, ట్రైనింగ్ అధికారి, అసోసియేట్ ప్రొఫెసర్ షేక్ అంజాద్ అలీ పరీక్షలను పర్యవేక్షించారు. 75 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు.

పేదలకు అన్నదానం



తెనాలి: కఠెవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ మైలా భానుప్రసాద్ జన్మదినం సందర్భంగా గురువారం ఆయన మిత్ర మండలి స్థానిక రైల్వేస్టేషను వద్ద పేదలకు అన్నదానం చేసింది. శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, తుల్లిమిల్లి చంటి, చెన్నూరి సాయి, కోలా శేఖర్, బంగారు పోతురాజు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట నిరసన

మంగళగిరి: నగరంలోని హయ్యర్ ఎడ్యుకేషన్ కార్యాలయం ఎదుట గురువారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి జాన్సన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్శిటీల్లో ఖాళీగా ఉన్న 3వేల ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడంతోపాటు కోర్సులు పెంచాలని, నిలిపివేసిన కోర్సులను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూ హక్కు పత్రాలు పరిశీలన

ఫిరంగిపురం: జాతీయ రహదారి 167–ఏజీ(కొండమోడు–పేరేచర్ల)నిర్మాణం కోసం రైతులకు సంబంధించిన భూమి హక్కు పత్రాలను గురువారం తన కార్యాలయంలో తహసీల్దారు పద్మనాభుడు, ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది పరిశీలించారు. తహసీలారు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని అమీనా బాద్, తక్కెళ్లపాడు గ్రామాలలో భూ సేకరణ జరుగుతోందని, భూములు ఇవ్వడానికి ఆసక్తి కలిగిన రైతులు భూమి ఒరిజనల్ డాక్యుమెంట్లు, వాటి జిరాక్సు కాపీలు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు పాసు పుస్తకాలతో హాజరయ్యారని చెప్పారు. తక్కెళ్లపాడుకు చెందిన 16మంది. అమీనాబాద్‌కు చెందిన 31మంది రైతులు హక్కు పత్రాలతో హాజరయ్యారని తెలిపారు. ఇన్‌చార్జి ఆర్డీఓ శివనారాయణశర్మ పర్యవేక్షణలో కార్యాలయం సిబ్బంది వాటిని పరిశీలించారన్నారు.

ఎలుకల మందు తిని యువకుడి ఆత్మహత్య

చేబ్రోలు: ఎలుకల మందు తిని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో జరిగింది. చేబ్రోలు చెరువులోపాలెం ప్రాంతానికి చెందిన పల్లె రవి (36) కుటుంబ మనస్పర్థల కారణంగా మద్యంలో ఎలుకల మందు కలుపుకొని సేవించాడు. బంధువులు గమనించి రవిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మరణించాడు. మృతునికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.